క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళ వారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తాండూరు డీఈఈ భానుప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తొర్మామిడి 33 కేవీ సబ్‌స్టేషన్ ఫీడర్‌పై ఉన్న చెట్ల కొమ్మలు తొలగించేందుకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. గాజీపూర్, ఇందూర్, తట్టిపల్లి, పెద్దేముల్, బంట్వారం విద్యుత్ సబ్‌స్టేషన్ కింద ఉన్న గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ నాగరాజు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మండల కేంద్రంతోపాటు తుంకిమెట్ల, ఏర్పుమళ్ల, నాగిరెడ్డిపల్లి, మెట్లకుంటతోపాటు వీటి అనుబంధ తండాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ



విద్యార్థులకు గుర్తింపుకార్డులు అందిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

దుద్యాల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మండల విద్యాధికారి విజయ రామరావు సోమవారం గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందించడమే ప్రభుత్వం లక్ష్యమని చెప్పారు. పదో తరగతి చదువుతున్న 65 మంది విద్యార్థులకు గుర్తింపు కార్డులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్‌గౌడ్, సుధాకర్‌రావు, రాములు, రవినాయక్, ముకుందరెడ్డి, శ్రీనివాస్, సాలిబాయి తదితరులు పాల్గొన్నారు.


స్నేహితుడి కుటుంబానికి భరోసా



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

దోమ: తమతో పాటు కలిసి చదువుకున్న మిత్రుడి అకాల మరణంతో తోటి స్నేహితులు చలించారు. ఇటీవల మండలంలోని బాస్‌పల్లి గ్రామానికి చెందిన ఏ.నర్సింహులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కాగా ఆయనతో పాటు కలిసి బొంపల్లి జెడ్పీ పాఠశాలలో చదువుకున్న 2009–10 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. సోమవారం రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. భవిష్యత్తులో సైతం అండగా ఉంటామని అలనాటి స్నేహితులు భరోసానిచ్చారు.

రైతుల అభ్యున్నతే లక్ష్యం



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్

కుల్కచర్ల: రైతుల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో గతంలో కార్యదర్శిగా పనిచేసిన విజయ్‌కిశోర్‌కు వీడ్కోలు అందించి, నూతనంగా వచ్చిన మార్కెట్ కమిటీ కార్యదర్శి సారంగపాణికి స్వాగతం పలికారు. రైతాంగ ఉన్నతికి మార్కెటింగ్ శాఖ ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్‌శర్మ, డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి దరఖాస్తులు నిల్

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి దరఖాస్తులు రాలేదు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తామని కావున ప్రతి ఒక్కరు తమ సమస్యలు విన్నవించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ చాంద్‌పాషా, ఏపీఓ అంజిలయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. జర పైలం!



దౌల్తాబాద్‌లో నిల్వ నీటిని పరిశీలిస్తున్న వైద్యసిబ్బంది

- పరిశుభ్రత పాటించాలంటున్న వైద్యాధికారులు
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

దౌల్తాబాద్: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఈ కాలంలో ప్రజలు సాధారణంగా కలుషిత నీరు, ఆహారం తీసుకోవడంతో పాటు పరిసరాల అపరిశుభ్రత కారణంగా సాధారణ జ్వరం, జలుబు, మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర రోగాల బారిన పడుతుంటారు. ఇప్పటికే అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఏఎన్ఎం, ఆశవర్కర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి నిల్వ నీటిని పారబోయిస్తూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నారు. అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ప్రజలకు సూచిస్తున్నారు.

వారంలో రెండు రోజులు డ్రైడే

గతంలో వైద్య పంచాయతీ, సిబ్బంది వారంలో ఒకరోజు(శుక్రవారం) డ్రై డే నిర్వహించి ఇంటింటికీ తిరుగుతూ నిల్వ నీటిని పారబోయించి ప్రజలకు అవగాహన కల్పించేవారు. ప్రస్తుతం వారంలో రెండు రోజులు డ్రైడే నిర్వహిస్తున్నారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడు వివరిస్తున్నారు.

దోమలను నివారించే విధానం

మలేరియా, డెంగీ తదితర రోగాల బారిన పడేందుకు దోమలే ముఖ్య కారణం. వీటి కట్టడికి ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. సమీపంలోని మురుగుకాల్వల్లో ఆయిల్ బాల్స్ వేయిస్తూ దోమ తెరలు వినియోగించాలి. దీంతోపాటు ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. చెత్తా చెదారం ఎక్కడ పడితే అక్కడ వేయకుండా అందుకు పటిష్ట ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ▲ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. భోజనానికి ముందు, మల మూత్ర విసర్జన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.
- ▲ కాచి చల్లార్చిన నీటిని, తాజా ఆహార పదార్థాలను మాత్రమే తీసుకోవాలి.
- ▲ బయట ఆహార పదార్థాల జోలికి వెళ్లకూడదు.
- ▲ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి.
- ▲ చిన్నారులు, వృద్ధులు శరీరం పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలి.
- ▲ దోమ తెరలు తప్పనిసరిగా ఉపయోగించాలి.
- ▲ ఇళ్ల చుట్టూ ఖాళీ ప్రదేశాల్లో వర్షపు నీరు నిలిచే చోట ఆయిల్ బాల్స్ వేయాలి.
- ▲ అనారోగ్యానికి గురైతే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వైద్యులను సంప్రదించాలి.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెంచాలి



పూడూరు: ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజల్లో నమ్మకం కలిగేలా వైద్య సేవలు అందించాలని జిల్లా ఉప వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అంగవైకల్యం శిబిరాన్ని నిర్వహించారు. దివ్యాంగులు ఈ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఆస్పత్రికి వచ్చిన 56 మంది రోగుల రక్త నమూనాలు సేకరించి పరీక్షించారు. కార్యక్రమంలో వైద్యులు దేవికారెడ్డి, మైమూద్ ఫరూకీ, ఆశాఫౌండేషన్ వైద్యురాలు శృజన, ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స అందిస్తాం



వ్యాధుల బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. మన శరీర ఉష్ణోగ్రత 100 డిగ్రీలు దాటితే జ్వరంగా ఉన్నట్లు పరిగణించాలి. అనారోగ్యంగా ఉన్నట్లు అన్పిస్తే ప్రభుత్వ ఆస్పత్రికి రావాలి. వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు అందిస్తాం.

– అమూల్య ప్రియదర్శిని, వైద్యురాలు, పీహెచ్‌సీ దౌల్తాబాద్

ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం

మోమిన్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుభాష్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఇజ్రాచిట్టంపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గు వేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు, లబ్ధిదారులు తదితరులు ఉన్నారు.

పనులు వేగవంతం చేయాలి

బంట్వారం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ రాములు అన్నారు. సోమవారం ఆయన బంట్వారం, యాచారం, తొర్మామిడి, మాలసోమారం, రొంపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి ఇళ్ల నిర్మాణానికి ముగ్గు వేయించారు. లబ్ధిదారులకు విడతల వారీగా బిల్లులు చెల్లిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ నాగరాజు, నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల కల సాకారం

కుల్కచర్ల: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పేదల కలలను సాకారం చేస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఆనందం, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు రాంరెడ్డి, కృష్ణయ్య, జావీద్, రషీద్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మోమిన్‌పేట: ఇజ్రాచిట్టంపల్లిలో ఇంటి నిర్మాణానికి ముగ్గు పోస్తున్న నాయకులు

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: ఇందిరమ్మ ఇళ్లు పేదలకు వరంగా మారాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని లింగన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. ఇందులో నాయకులు నర్సింలుగౌడ్, జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్, మల్లేశం, రాంచంద్రారెడ్డి, కాశప్ప, రమేశ్ తదితరులున్నారు.

రేపటి నుంచి భగవద్గీత పారాయణం



మాట్లాడుతున్న గీతావాహిణి బృంద సభ్యులు

అనంతగిరి: గీతావాహిణి ఆధ్వర్యంలో బుధవారం నుంచి 9 రోజుల పాటు పట్టణంలోని ఆయా దేవాలయాల్లో సామూహిక భగవద్గీత పారాయణం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షురాలు శ్రీదేవిసదానందరెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం కార్యక్రమ వివరాలు వెల్లడిస్తూ ఆమె మాట్లాడారు. గత ఏడేళ్లుగా ఆషాఢమాసంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 9 నుంచి 17 వరకు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గీతాపారాయణం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు లావణ్య, ప్రధానకార్యదర్శి జయశ్రీ, కోశాధికారి వరలక్ష్మి, సభ్యులు విజయ, ఝాన్సీరాణి, నీరజ, మాధురి, సంజీవరాణి, వరలక్ష్మి, సరళ, స్వాతి, సునీత, సరిత, లక్ష్మి, రజిత, లక్ష్మి, మమత తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ అంతంతే

ధారూరులో 4,445 రైతులు మాత్రమే నమోదు

ధారూరు: కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిస్ట్రీ కార్యక్రమానికి రైతుల నుంచి స్పందన లభించడం లేదు. సోమవారం వరకు ధారూరు మండలం నుంచి 4,445 మంది కర్షకులు మాత్రమే తమ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ఇంటింటికి వెళ్లి తమ భూములను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచిస్తున్నా బేఖాతరు చేస్తున్నారు. మండలంలో పట్టాదారు పాసుపుస్తకాలు కలిగిన రైతులు 15,791 మంది ఉన్నారు. పొలాలున్న ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని ఏఈఓలు వారిని అభ్యర్థిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అందే పీఎం కిసాన్ డబ్బులను ఇందులో అనుసంధానం చేస్తారని వివరిస్తున్నారు. అయినా అన్నదాతలు అంతంతమాత్రంగానే ఫార్మర్ రిజిస్ట్రీ నమోదుకు ముందుకు వస్తున్నారు.



గురుదోట్ల రైతువేదికలో ఫార్మర్ రిజిస్ట్రీలో నిమగ్నమైన అధికారులు

కష్టపడే వారికి పార్టీలో గుర్తింపు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి మైసిగండి గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాలులో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు దళపతిగౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి యూత్ కాంగ్రెస్ కార్యకర్తల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతమయ్యేలా చురుగ్గా పనిచేయాలని సూచించారు. వాటి గురించి ప్రజలకు వివరించాలని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలన్నారు. అనంతరం రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి శ్రేణులు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, ఇన్‌చార్జీలు రాంచంద్రరెడ్డి, అరవింద్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవి, నియోజకవర్గ ఇన్‌చార్జీలు దయసాగర్‌రెడ్డి, బాలకోటి, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజేశ్, అభినవ్‌రెడ్డి, అనిల్‌గౌడ్, షాబుద్దీన్ పాల్గొన్నారు.



కడ్తాల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

బుగ్గయ్యగౌడ్ సేవలు చిరస్మరణీయం

మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దివంగత పాలకూర్ల బుగ్గయ్యగౌడ్ మండల అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి ఎక్వాయిపల్లి గ్రామంలో బుగ్గయ్యగౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మృతుడి కుటుంబీలకు పరామర్శ

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామ పంచాయతీలో స్వీపర్‌గా పని చేసిన జంగయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి.. సింగంపల్లిలో జంగయ్య పార్థివదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబీకులను పరామర్శి, ఆర్థిక సహాయం అందజేశారు.

నేడు రైతు నేస్తం వీసీ

బంట్వారం: రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌ను బుగ్గాపూర్ రైతు వేదికలో మంగళవారం నిర్వహిస్తున్నామని కోట్‌పల్లి ఏఈఓ సందీప్ ఓ ప్రకటనలో తెలిపారు. పత్తి సాగు, అధిక సాంద్రత అనే అంశంపై వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే వీసీకి రైతులందరూ సకాలంలో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

పామాయిల్ సాగుకు దరఖాస్తుల ఆహ్వానం

మర్పల్లి: పామాయిల్ తోటల సాగుకు ఆసక్తి ఉన్న రైతులు సిరిపురం రైతువేదికలో దరఖాస్తు చేసుకోవాలని సిరిపురం క్లస్టర్ ఏఈఓ మహేశ్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు. బాయి, బోరు ఉన్న రైతులు భూమి పట్టాపాస్ బుక్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పాస్‌బుక్ జిరాక్స్ కాపీలతో పాటు ఎకరా పామాయిల్ సాగుకు రూ.1,140 డీడీ తీయాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సిరిపురం రైతువేదికలో తమను సంప్రదించాలన్నారు.

జూనియర్ కళాశాల పరిశీలన

దోమ: ప్రభుత్వ జూనియర్ కళాశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎంపీడీఓ గ్యామా అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కళాశాలను ఎంఈఓ వెంకట్‌తో కలిసి సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందన్నారు. అలాంటి ఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు చేస్తామన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి ప్రయోజకులు కావాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాధ, శ్రీవిద్య, రాములు, లక్ష్మయ్య, సునీత, శ్రీకాంత్, సానియాసుల్తానా, చంద్రశేఖర్‌రెడ్డి, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత నేరస్తుడి రిమాండ్

గోల్కొండ: దొంగతనాలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని రిమాండ్‌కు తరలించారు. సోమవారం గొల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ వివరాలు వెల్లడించారు. అబిడ్స్ కట్టేల మండీకి చెందిన మహ్మద్ ముజాహిద్ ఖురేష(31) నాంపల్లిలోని ఓ షాపులో పని చేస్తున్నాడు. చెడు వ్యసనాలకు అలవాటు ఇటీవల చోరీలకు పాల్పడుతుండగా వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయి. మహారాష్ట్రలో సైతం మహ్మద్ ముజాయిద్ ఖురేషీపై కేసు నమోదై ఉంది. ఈ నెల 1న నయాకీలా గోల్కొండకు చెందిన అమీర్ ఖాతూన్ ఇంట్లో 70 వేల నగదుతో పాటు కొన్ని బంగారు ఆభరణాలు చోరీ అయినట్లు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఈ నెల 7న గోల్కొండ జమాలిదర్వాజా అనుమానాస్పదంగా తిరుగుతున్న మహ్మద్ ముజాయిద్ ఖురేషీ అదుపులోకి తీసుకుని విచారించగా పాత నేరస్తుడిగా తేలింది. నయాకీలాలో దొంగతనానికి పాల్పడింది తానే అని అంగీకరించడంతో రూ.70 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు

గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి

షాబాద్: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు ఎలుగంటి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీఆర్ఆర్ స్టేడియంలో జరుగుతున్న ఏఎంఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో గత 10 రోజులుగా ఎస్‌పీఎల్-3లో క్రికెట్ టోర్నమెంట్‌లో ముంబై వర్సస్ గుజరాత్ టీమ్స్ మధ్య హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం ఎస్ఆర్‌హెచ్ ప్లేయర్ కి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడూతూ.. రాష్ట్రంలో క్రీడాపాలసీ ద్వారా గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలికితీసి, వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గ్రామస్థాయి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో యువత ప్రతిభ కనబర్చాలని సూచించారు. క్రీడాపోటీల నిర్వహణతో గ్రామాల మధ్య స్నేహ సంబంధాలు ఏర్పాడుతాయన్నారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించి లక్ష్యం దిశగా ముందుకుసాగాలని సూచించారు. క్రీడలతో మానసికోల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చన్నారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే విజయాలు వరిస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, నాయకులు రాహుల్‌గుప్తా, గౌరీశ్వర్, శ్రీనివాస్, రఫిక్, మహేశ్, గౌతమ్, దయాకర్, టోర్నమెంట్ ఆర్గనైజర్లు, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ సంబురం

ఎస్సీ కులాల ఉప వర్గీకరణ సాధనకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) అలుపెరగని పోరు చేసిందని ఆయా నాయకులు గుర్తుచేశారు. సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముప్పై ఏళ్లకు పైగా మంద కృష్ణమాదిగ వర్గీకరణ కోసం విశేష కృషి చేశారన్నారు. వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లో ముఖ్య కూడళ్లలో జెండాలను నాయకులు ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ పోరాటస్ఫూర్తిని కొనసాగించాలని పేర్కొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



వికారాబాద్‌లో ఆవిర్భావ వేడుకలో ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్



ధారూరు: కేరెళ్లిలో జరిగిన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుక



దోమ: బొంపల్లిలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



యాలాల: మండల కేంద్రంలో..



బొంరాస్‌పేట: ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



కుల్కచర్ల: ప్రధాన చౌరస్తాలో కేక్ కట్ చేస్తున్న నాయకులు